andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.5, కనిష్ఠం 18.2



కలెక్టరేట్‌లో ఉద్యోగుల నిరసన

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి16: కలెక్టర్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం భోజన విరామ సమయంలో అఖిల భారత ఉద్యోగుల సమాఖ్య నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదాయ పన్ను పరిమితిని రూ. 10లక్షలకు పెంపు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులర్ చేయడంతోపాటు పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



● కుభీర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

● పదవుల కోసం పట్టు
● పదేళ్ల తర్వాత గుర్తింపు కోసం తహతహ
● తెరపైకి సీనియర్ నేతలు
● జిల్లాలోని ఐదు కమిటీలకు పోటాపోటీ
● కాంగ్రెస్‌కు సవాల్‌గా ఎంపికలు

మార్కెట్ కమిటీలపై నేతల నజర్!

నిర్మల్, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): చాలా యేళ్ల నుంచి పదవుల కోసం ఎదురుచూస్తున్న అధికార కాంగ్రెస్ పార్టీ నేతలకు ఎట్టకేలకు శుభ సమయం ఆసన్నమైంది. ఇటీవలే ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మార్కెట్ కమిటీల పాలకవర్గాలను రద్దు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పదవుల కోసం ఎదురుచూస్తున్న వారందరికీ ఊరట కలుగుతోంది. దాదాపు పదేళ్ల నుంచి ఎలాంటి నామినేటెడ్ పదవులకు నోచుకోని వీరంతా ఇక తమకు మార్కెట్ పదవులు కావాలంటూ పట్టుబడుతున్నారు. సీనియర్‌లు చైర్మన్ పదవులను ఆశిస్తుండగా జూనియర్ నేతలు డైరెక్టర్‌పదవులను సైతం చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటిస్తున్నారు. దీంతోపాటు దేవాలయాల కమిటీ చైర్మన్ పదవుల కోసం కూడా కొంతమంది స్థానిక నేతలు తమ వంతు ప్రయత్నాలు ఇప్పటికే మొదలుపెట్టారు. నిర్మల్ జిల్లాలో మొత్తం ఐదు మార్కెట్ కమిటీలు ఉండడంతో పదవుల పంపకం ప్రాధాన్యతను సంతరించుకుంటోందని అంటున్నారు. కాగా జిల్లాలోని మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు జిల్లాలో అత్యంత ప్రాధాన్యత ఉండడమే కాకుండా ప్రొటోకాల్ కూడా వర్తించనుండడంతో అందరి దృష్టి ఇటువైపే నిలుస్తోందని అంటున్నారు. ఇప్పటికే చాలామంది నేతలు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు దృష్టికి ఈ అంశాన్ని తీసుకువెళ్లి పదవుల పంపకంలో తమ పేరుకు ప్రాధాన్యత కల్పించాలంటూ కోరుతుండడం చర్చకు తావిస్తోందంటున్నారు.

జిల్లాలో ఐదు మార్కెట్ కమిటీలు

నిర్మల్ నియోజకవర్గంలో రెండు మార్కెట్ కమిటీ చైర్మన్‌లు, ముథోల్ నియోజకవర్గంలో రెండు, ఖానాపూర్‌లో ఒక మార్కెట్ కమిటీలున్నాయి. దీంతో ఐదు చైర్మన్ పదవులు, మరో ఐదు వైస్‌చైర్మన్ పదవులతోపాటు డైరెక్టర్ పదవుల నియామకాలను ప్రభుత్వం నామినేటేడ్ పద్ధతిలో చేపట్టబోతోంది. ముఖ్యంగా రాజకీయ ప్రాధాన్యత గల నిర్మల్ నియోజకవర్గంలో మార్కెట్ కమిటీచైర్మన్ పదవుల పంపకం కాంగ్రెస్ పార్టీకి కత్తిమీద సాములా మారనుందంటున్నారు. నిర్మల్‌తోపాటు సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను ఆయా ప్రాంతాల సీనియర్ నేతలంతా ఆశిస్తున్న కారణంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు చైర్మన్ పదవుల ఎంపిక వ్యవహారం సవాల్ కానుందంటున్నారు. మొదటి నుంచి శ్రీహరిరావు వెంట ఉండి మొన్నటి ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం కృషి చేసిన పలువురు సీనియర్ నాయకులు చైర్మన్ పదవుల కోసం పట్టుబడుతున్నారు.

నిర్మల్‌లో పోటీ తీవ్రం

నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం సీనియర్ నేత, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు అత్యంత సన్నిహితుడైన మేడిపెల్లి భీంరెడ్డి మార్కెట్ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఆయన గతంలో సర్పంచ్ పదవితోపాటు పలు పదవులను చేపట్టారు. మొదటి నుంచి శ్రీహరి రావు వెంట నడవడమే కాకుండా రాజకీయ వ్యూహరచనలో దిట్టగా పేరుపొందారు. తనకు పదవిని కేటాయించాలంటూ ఇప్పటికే శ్రీహరిరావుకు వివరించినట్లు సమాచారం. అలాగే ఆ పార్టీ నాయకులు నాందేడపు చిన్ను, పూదరి అరవింద్, బురాజ్‌తోపాటు పరిమండల్ రమణారెడ్డి, గాజుల రవికుమార్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ వాజిద్ హైమద్, అతీక్ హైమద్, గుండంపెల్లికి చెందిన సాగర్‌రెడ్డి, సిద్దిలకుంటకు చెందిన గడ్డం చిన్న నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ సాధ సుదర్శన్, వెంగ్వాపేట్ మాజీ సర్పంచ్, న్యాయవాది రమేష్‌లు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. చైర్మన్ ఎంపిక వ్యవహారం కాంగ్రెస్‌కు కీలకం కానుందంటున్నారు. దీంతో పాటు సారంగాపూర్, కుభీర్, భైంసా,ఖానాపూర్ చైర్మన్ పదవుల ఎంపిక కూడా అక్కడి స్థానిక నాయకులకు ప్రతిష్ఠాత్మకం కానుందంటున్నారు.

ఖానాపూర్‌లో పోటాపోటీ

ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు అక్కడి కాంగ్రెస్ పార్టీ నేతలకు సవాల్‌గా మారనుంది. ఖానాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు తన సమీప అనుచరులకు ఈ పదవిని ఇప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఖానాపూర్‌లో మార్కెట్ చైర్మన్ పదవి కోసం ఎక్కువపోటీ ఉన్న కారణంగా ఎమ్మెల్యేకు ఈ ఎంపిక వ్యవహారం చిక్కులు సృష్టించే అవకాశాలు లేకపోలేదంటున్నారు. ప్రతీసారి ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక వ్యవహారం ఆయా అధికార పార్టీలకు చిక్కులు సృష్టిస్తుండడం సహజమేనంటున్నారు. ప్రస్తుతం చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో పార్టీ మండలాధ్యక్షుడు దొనికెని దయానంద్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈయనతోపాటు ఖానాపూర్ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు తోట సత్యంలతో పాటు మరికొంతమంది చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అప్పటి అధికార బీఆర్ఎస్ నుంచి అనేక ప్రతిబంధకాలు ఎదుర్కొన్న సమయంలో పార్టీ కోసం అండగా ఉన్న మండలాధ్యక్షుడు దయానంద్, టౌన్ ప్రెసిడెంట్ నిమ్మల రమేష్, మాజీ మండల ఉపాధ్యక్షుడు సత్యంలు ఈసారి చైర్మన్ పదవిని తమకే కట్టబెట్టాలంటూ పట్టుబడుతున్నారు. అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే రేఖానాయక్‌పై తిరుగుబాటు జెండాను ఎగురవేయడమే కాకుండా ఆమెకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసిన మాజీ మార్కెట్ చైర్మన్ గంగనర్సయ్య చైర్మన్ పదవి కోసం పట్టుబడుతూ ఎమ్మెల్యేతో పాటుఇక్కడి సీనియర్ నేతలపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఈయన మంత్రి సీతక్క ద్వారా పదవిపై హామీ కూడా పొందినట్లు చెబుతున్నారు. చివరకు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ఆశీస్సులు ఉన్న వారికే ఇక్కడ మార్కెట్ చైర్మన్ పదవి దక్కడం అన్నది బహిరంగ రహస్యమే. అయితే ఎమ్మెల్యే బొజ్జు మాత్రం ఇప్పటి వరకు ఎవరికీ స్పష్టమైన హామీ ఇవ్వకుండా అచితూచి ధోరణిని అవలంబిస్తున్నారు.

భైంసా, కుభీర్‌లో గట్టి పోటీ..

జిల్లాలోనే అత్యంత ఆదాయాన్ని సమకూర్చే భైంసా మార్కెట్ కమిటీ ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక్కడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం పలువురు సీనియర్ నేతలు పట్టుబడుతున్నారు. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జీ నారాయణరావు పటేల్ కుమారుడు బోస్లే అఖిలేష్ పటేల్ ఈ పదవిని ఆశిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా ఉంటుండడమే కాకుండా ఇక్కడి పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తున్న తనకే పదవిని ఇవ్వాలంటూ అఖిలేష్ పటేల్ కోరుతున్నట్లు చెబుతున్నారు. అయితే భైంసాలో మైనార్టీలు కీలకం కానున్నందున ఆ వర్గం నుంచి కూడా పలువురు సీనియర్ నాయకులు చైర్మన్ పదవిని కోరుతున్నారు. ముఖ్యంగా మైనార్టీ నేత యంఎ. లతీఫ్ ఈసారి ఎలాగైనా మైనార్టీలకు ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే తనను ఎంపిక చేయాలంటూ ఆయన అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొంటున్నారు. నారాయణ రావు పటేల్‌కు లతీఫ్ సన్నిహితుడు కావడమే కాకుండా పార్టీ రాష్ట్రస్థాయి నేత షబ్బీర్ ఆలీ ద్వారా కూడా లతీఫ్ ప్రయత్నాలు సాగిస్తున్నారంటున్నారు. అలాగే ఎడ్‌బిడ్ మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డితో పాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, శంకర్ చంద్రేలు కూడా ఈసారి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రేసులో ఉన్నారంటున్నారు. అలాగే కుభీర్ మార్కెట్ కమిటీచైర్మన్ పదవి కోసం సీనియర్ నేత రమేష్, కుభీర్ మండల కేంద్రానికి చెందిన నేత వన్నెల సతీష్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారంటున్నారు. వీరంతా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ నారాయణరావు పటేల్‌పై ఒత్తిడి మొదలు పెట్టినట్లు పేర్కొంటున్నారు.

సారంగాపూర్‌లోనూ కీలకమే..

నిర్మల్ నియోజకవర్గంలోని సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎంపిక వ్యవహారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు కీలకం కానుందని అంటున్నారు. ఇక్కడి చైర్మన్ పదవిని ఆశిస్తున్న నేతలంతా శ్రీహరిరావుకు అత్యంత సన్నిహితులు కావడమే కాకుండా కష్టకాలంలో సైతం ఆయన వెన్నంటి నడిచినవారేనంటున్నారు. ఇక్కడి సీనియర్ నేత బొల్లోజి నర్సయ్య, స్వర్ణ గ్రామ మాజీ సర్పంచ్ ఆది, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ రాజేశ్వర్‌లతో పాటు జామ్ గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాయుడి భూమన్న, కూన భూమన్నలు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం పోటాపోటీగా ప్రయత్నాలు సాగిస్తుండడం కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. చైర్మన్‌పదవిని ఆశిస్తున్న నేతలందరు తనకు సన్నిహితులు కావడంతో ఇక్కడ చైర్మన్ పదవి ఎంపిక వ్యవహారం శ్రీహరిరావుకు కీలకం కానుందని అంటున్నారు. అయితే అందరితో చర్చించిన తరువాతనే శ్రీహరిరావు చైర్మన్, వైస్ చైర్మన్ పదవులతోపాటు డైరెక్టర్ పదవులను ఎంపిక చేయనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. మార్కెట్ పదవుల్లో న్యాయం జరగకుంటే ఇతర నామినేటేడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పిస్తానంటూ శ్రీహరిరావు ఇప్పటికే అందరికి నచ్చజెప్పుతున్నట్లు సమాచారం.



నారాయణరెడ్డికి కాంగ్రెస్ కండువా వేస్తున్న మాజీ మ్మెల్యే

పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్‌ను హస్తగతం చేసుకుందాం

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్

భైంసా, ఫిబ్రవరి 16: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని కైవసం చేసుకుందామని ముథోల్ కాంగ్రెస్‌శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ సూచించారు. శుక్రవారం లోకేశ్వరం వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికతో అమలు చేస్తున్న ఆరుగ్యారెంటీలు, కల్పిస్తున్న ఉద్యోగాలు, చేపడుతున్న అభివృద్ధి, సంస్కరణల మూలంగా పార్టీకి ఆదరణ పెరుగుతోందన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పించి ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి మాజీ ఎమ్మెల్యే పాటిల్ కండువాలు వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఇందులో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జుట్టు అశోక్, మాజీఎంపీపీ ఎస్, భోజరామ్ పాటిల్, లోకేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ సుదర్శన్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సోమ సుధీర్‌రెడ్డిలతో నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సస్యరక్షణపై రైతులకు అవగాహన

ముథోల్, ఫిబ్రవరి 16: మండలంలోని చించాల గ్రామంలో శుక్రవారం మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ముథోల్ ఏరువాక కేంద్రానికి చెందిన సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ విజయకుమార్, డాక్టర్ కార్తీక్‌లు క్షేత్రస్థాయిలో వెళ్లి అవగాహన కల్పించారు. అధికఎరువులతో కలిగే నష్టాలు సరైన సమయంలో చేపట్టే సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు శివాజీ, ముత్యం, శివరాం, భూషణ్, సాయినాథ్, తదితరులు పాల్గొన్నారు.

దస్తూరాబాద్ ఎస్సైగా ఎండీ యాసిర్ అరాఫత్

దస్తూరాబాద్, ఫిబ్రవరి16: దస్తూరాబాద్ ఎస్సైగా ఎండీ యాసిర్ అరాఫత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఎస్సైగా విధులు నిర్వహించిన ప్రభాకర్‌రెడ్డి బదిలీపై వెళ్లగా, దిలావర్‌పూర్ మండలంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎండీ యాసిర్ అరాఫత్ బదిలీపై వచ్చారు.

ట్రిపుల్ ఐటీలో కార్మికుల ఆందోళన

బాసర, ఫిబ్రవరి, 16: బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో పనిచేసే పారిశుధ్య కార్మికులు శుక్రవారం ఆందోళనకు దిగారు. మూడు నెలలుగా జీతాలు రాకపోవడం, వీడీఏ, పీఎఫ్ డబ్బులు నాలుగేళ్ల నుంచి చెల్లించడం లేదని కార్మికులు నిరసన చేపట్టారు. ఎవరూ విధుల్లోకి వెళ్లకుండా ప్రధాన గేటు వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ వెంటనే ఒకనెల వేతనం అకౌంట్‌లలో వేసినట్లు కార్మికులు తెలిపారు. యూనివర్సిటీ అధికారుల విన్నపంమేరకు గడువుఇచ్చి కార్మికులు ఆందోళన విరమించారు.



నిరసన తెలుపుతున్న కార్మికులు

రైల్వేలైన్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలి

● రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ ఎంసీ లింగన్న



మానవహారంలో పాల్గొన్న రైల్వే సాధన సమితి నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 16: ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా రైల్వేలైన్ నిర్మాణం కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కేంద్రాన్ని రైల్వేలైన్ సాధన కమిటీ చైర్మన్ ఎంసీ లింగన్న, కన్వీనర్ డాక్టర్ మనోజ్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్మల్ పట్టణ కేంద్రంలోని పలు వీధుల్లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. శివాజీ చౌక్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి రైల్వే లైన్ తీసుకొస్తానని బాండ్ రాసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైల్వేలైన్ కోసం ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ట్రస్మా అధ్యక్షుడు చంద్ర గౌడ్, యూ.కృష్ణంరాజు, సాయన్న, శాంతిలాల్ పాటిల్, గొజ్జ జనార్ధన్, ఇంతియాజ్ అహ్మద్, చాంద్ పాషా, ఇతర నాయకులు, స్థానిక యువకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 16: సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ప్రైవేట్ ఆసుపత్రుల డాక్టర్లతో సీఐ-సెక్షన్ ప్రసవాలపై సమీక్ష సమావేశమై మాట్లాడారు. ఆపరేషన్ ద్వారా ప్రసవాలను తగ్గించి సాధారణ ప్రసవాలను పెంచాలని కోరారు. గత కొంతకాలంగా ఆపరేషన్ ప్రసవాలను తగ్గించాలని సూచించినా ఫలితాలు రావడంలేదని, ఇకపై ఆపరేషన్ ప్రసవాలను తగ్గించని వారిపై చట్టప్రకారం చర్యలు చేపడతామన్నారు. అందు కని మొదటి నుంచి గర్భిణీలకు సాధారణ ప్రసవాల గురించి కౌన్సిలింగ్ నిర్వహించి, సాధారణ ప్రసవాలవైపు వారిని ప్రోత్సహించాలని ఈ సందర్భంగా డాక్టర్స్‌ను కోరారు. జిల్లాలో ఎంటీపీ నిర్వహిస్తున్న ప్రతి ఆసుపత్రి కూడా విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ చేయిం చుకోకుండా ఎంటీపీ నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలియజేశారు. సమావేశంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్, నిర్వహణ అధికారి డాక్టర్ నయనారెడ్డి, ఎంహెచ్ఎన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ రామకృష్ణ డి ప్యూటీ జిల్లా విస్తరణ, గైనకాలజిస్టులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ధనరాజ్

ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బీజేపీ సర్కారు

● మద్దతు ధర చట్టం తెచ్చి స్వామినాథన్ సిఫార్సులను అమలుచేయాలి: ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య ● బంద్‌లో భాగంగా సత్తెనపల్లిలో రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో

ఖానాపూర్, ఫిబ్రవరి16: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ అన్నింటినీ ప్రైవేట్‌పరం చేస్తోందని, రైతాంగాన్ని నిండా ముంచుతోందని ఏఐపీకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నంది రామయ్య ఆరోపించారు. శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా దేశవ్యాప్త పిలుపులో భాగంగా గ్రామీణ భారత్‌బంద్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని సత్తెనపల్లి గ్రామంలోని పెంబి చౌరస్తా వద్ద నిర్మల్, మంచిర్యాల రహదారిపై రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం రైతులు పండించిన పంటకు మద్దతు ధర, గ్యారంటీ చట్టాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. రైతన్నకు ఆర్థికంగా భరోసా కలిగించే స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం విడనాడాలన్నారు. పేద, మధ్యతరగతి రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం ఒకేసారి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. 60ఏళ్లు పైబడిన అందరికీ పెన్షన్ ఇవ్వాలన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌మిశ్రాను మంత్రివర్గం నుంచి తొలగించి ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకాన్ని రైతులకు ఉపయోగపడేలా రూపొందించాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి విద్యుత్ సవరణ బిల్లు 2022ను ఉపసంహరించుకోవాలన్నారు. కనీసవేతనం 26వేలు చెల్లించి, రైతన్నకు 10వేల పెన్షన్ అందజేయాలని డిమాండ్‌చేశారు. అందరికీ ఉద్యోగభద్రత కల్పించడంతో పాటు ఉపాధిహామీ చట్టాన్ని విస్తరించి 200 పనిదినాలను కల్పించాలని డిమాండ్ చేశారు. రైల్వే, రక్షణ, విద్యుత్ సహాప్రభుత్వం, ఫ్లిక్ సర్వీసులలో ప్రైవేటీకరణ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేయవద్దన్నారు. రైతాంగంపై పెట్టిన 40 వేల కేసులను ఎత్తివేస్తానని ప్రధాన మోదీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. పంజాబ్, హర్యానా రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటం చేస్తుంటే వారిపై టీయార్ గ్యాస్ ప్రయోగించడం దుర్మార్గమైన చర్యగా వారు మండిపడ్డారు. వెంటనే కార్మిక, కర్షక లోకానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా ప్రజా సంఘాల నాయకులు ఎం. అంకుశ్‌రావు, సుంచల నారాయణ, మంచిగంటి లక్ష్మణ్, భూక్యారమేష్, కుంచెపు ఎల్లయ్య, ఇబ్రహీం గోపి నాయక్, సుదర్శన్, గుమ్ముల రమేష్, గంగారెడ్డి, వర్మ, తదితరులున్నారు.



ఖానాపూర్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

లేబర్ కోడ్లు రద్దు చేయకపోతే బీజేపీకి బుద్ధి చెబుతాం

ఖానాపూర్: కేంద్రప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన లేబర్‌కోడ్లను రద్దు చేయకుంటే బీజేపీకి బుద్ధి చెబుతామని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగెల్లి నర్సయ్య అన్నారు. శుక్రవారం జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త సమ్మెపిలుపులో భాగంగా రైతు సంఘం ఆధ్వరయంలో కలుపుకొని ఖానాపూర్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్టీఆర్‌చౌక్ నుంచి పాత బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి కమల, త్రివేణి, యూనియన్ అధ్యక్షులు గంగాధర్, కార్యదర్శి సురేష్, గ్రామ పంచాయతీ యువజన అధ్యక్షుడు శేఖర్, నాగరాజు పాల్గొన్నారు.



నిర్మల్, మంచిర్యాల రహదారిపై రాస్తారోకో చేస్తున్న నాయకులు



ఆందోళన చేస్తున్న నాయకులను పక్కకు తరలిస్తున్న పోలీసులు

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీదే గెలుపు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి

భైంసా, ఫిబ్రవరి 16: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీదే గెలుపని ఆ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భైంసాలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ నెల 20న బాసర నుంచి జిల్లాలో పార్టీ ఆధ్వర్యంలో కొమరంభీమ్ విజయ్ సంకల్ప యాత్ర జరుగనుందని పెర్కొన్నారు. పార్టీ శ్రేణులు బాధ్యతాయుతమైన విధానాలద్వారా విజయ్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. యాత్ర ప్రముఖ్ పల్లె గంగారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో మరోమారు ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ సర్కార్ అధికారం అప్పచెప్పాలని అన్ని వర్గాల ప్రజానీకం అభిలాషిస్తోందన్నారు. ఏ చోటకు వెళ్లిన ప్రధాని మోదీ హవా, బీజేపీ జోరు కొనసాగుతోందన్నారు. ఇందులోభాగంగానే ఎన్నికలకంటే ముందే ప్రజల ఆశీర్వాదం తీసుకునేందుకు పార్టీ అధిష్ఠానం విజయ్ సంకల్ప యాత్ర చేపట్టిందని వివరించారు. పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకమై ప్రధానిమోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ విజయ్ సంకల్ప యాత్రకు బాధ్యతాయుత భాగస్వామ్యాన్ని అందించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగే విజయ్ సంకల్ప యాత్ర నిర్వాహణ వ్యవస్థ, విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఇందులో అసెంబ్లీ ప్రభహరి పిల్లి శ్రీనివాస్, ముథోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర్ నారాయణ రెడ్డి, రవి పాండేలతోపాటు నియోజక వర్గ పరిధిలోని ఏడు మండలాల, భైంసా పట్టణ పార్టీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

లక్ష్మణచాంద, ఫిబ్రవరి16: మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన కరుణ, మంజులకు రూ.57వేలు ఇచ్చి నిర్మల్‌కు చెందిన రమేష్‌రెడ్డి అనే ప్రైవేట్ వైద్యుడు శుక్రవారం తన ఉదారతను చాటుకున్నారు. కరుణ, మంజుల మహిళలు ఫైనాన్స్ ద్వారా ఆటో కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఆటో నడవని కారణంగా కిస్తులు కట్టలేకపోవడంతో ఫైనాన్స్‌వారు ఆటోను జప్తుచేశారు. ఈ విషయం తెలుసుకున్న రమేష్‌రెడ్డి రూ.57వేల వాయిదా మొత్తం చెల్లిం చి ఆటో ఇప్పించి ఆయన ఉదారతను చాటుకున్నారు.

ఘనంగా రథ సప్తమి వేడుకలు

ముథోల్, ఫిబ్రవరి16: మండల కేంద్రమైన ముథోల్‌లోని శ్రీ సరస్వతి శిశు మందిరం ఉన్నత పాఠశాలలో, రబింద్ర, అక్షర, మండలంలోని ఫ్యూచర్ స్కూల్, భాష్యం, శ్రీవిద్యా పాఠశాలలో శుక్రవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సకల శక్తి ప్రధాత సూర్య భగవానుడిని పూజించి విద్యార్థులు, ఉపాధ్యాయులు సూర్య నమస్కారాలు చేశారు. ఈ సూర్య నమస్కారాల వల్ల మనిషి శారీరకంగా దృఢమవడమే కాక తేజస్సు పెరిగి బుద్ధి వికసిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు సారథి రాజు, సాయినాథ్, సుభాష్, ప్రవీణ్, మాధవ్‌రావు, సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదవ తరగతి అంతర్గత మార్కుల పరిశీలన

ముథోల్, ఫిబ్రవరి16: మండల కేంద్రమైన ముథోల్‌లోని రబింద్ర ఉన్నత పాఠశాల, శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలను పదవ తరగతి ఇంటర్నల్ మార్కుల పరిశీలన బృందం శుక్రవారం పరిశీలించింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మీర్జాపూర్ ప్రధానోపాధ్యాయులు విద్యాధరరావు, గంగాధర్ సందర్శించారు. విద్యార్థుల ప్రాజెక్టు నోట్స్‌లను ఇంటర్నల్ మార్కుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. పారదర్శకంగా మార్కులు ఇచ్చారా లేదా అనే విషయాన్ని తెలుసుకొనుటకు విద్యార్థులకు ప్రశ్నలు సంధించి అడిగి తెలుసుకున్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

భైంసారూరల్, ఫిబ్రవరి16: తమ సమస్యలను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేస్తూ దేశవ్యాప్త సమ్మెలో భాగంగా రైతులు భైంసా మండలం ప్రధాన రోడ్డుపై దేగాంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగ సమ స్యలు పరిష్కారం చేయకుండా మోసం చేస్తోందని అన్నారు. ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన రాతపూర్వక హామీని అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. రైతాంగం అప్పుల్లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని అన్నారు. మద్దతు ధర చట్టం తేవాలన్నారు. దేశవ్యాప్త రైతాంగ రుణాలు మాఫీ చేయాలని, రైతులకు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్షల కోట్ల కార్పొరేట్ల రుణాలు మాఫీ చేసి పేద రైతాంగాన్ని బలి చేస్తుందని తెలిపారు. కార్పొరేట్ అనుకూల చట్టాలను చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గంగాధర్, రామకృష్ణ, ముత్తన్న, శంకర్, రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

ముథోల్ : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రమైన ముథోల్‌లోని తహసీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం కార్మికులు సమ్మెను చేపట్టారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ గోదాంలో పని చేసే కార్మికులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతోందన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్‌లపై కేంద్రం ఎక్సైజ్ సుంకం తగ్గించాలని ప్రజా పంపిణీ వ్యవస్థ పీడీఎస్ విస్తరించాలన్నారు. 14 రకాల నిత్యావసర వస్తువులను అందించాలని ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు కే. గౌతమ్, శివాజీ, మసూద్, తదితరులున్నారు.

నులిపురుగుల నివారణకు శిక్షణ

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి16: ఈనెల 20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ శిక్షణలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి అందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత, సూపర్‌వైజర్ మతిన్, రమణ పాల్గొన్నారు.

ముందుకు సాగని రూర్బన్ పనులు

- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పలు భవనాలు
- లక్షలు ఖర్చు చేసినా అసంపూర్తిగానే..
- చేపట్టిన పనుల్లోనూ నాణ్యతా లోపాలు

కుంటాల, ఫిబ్రవరి16: కుంటాలలో రూర్బన్ పనులు ముందుకు కదలడం లేదు. పట్టణ తరహా వసతులు గ్రామీణప్రాంతాల్లో కల్పించాలనే సదుద్దేశంతో కేంద్రప్రభుత్వం శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ రూర్బన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగానే మూడో విడతలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కుంటాల మండలాన్ని ఎంపిక చేసింది. ఈ పథకం ద్వారా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, పారిశుధ్యం, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వాహణ, వీధిదీపాలు, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి, సిటిజన్ సర్వీస్ సెంటర్‌లు, డిజిటల్ అక్షరాస్యత, విద్యా, వైద్యం, ఉపాధి కల్పన, తాగునీరు, క్రీడా వసతులు, పర్యాటక అభివృద్ధి తదితర పనులను చేపట్టాలని నిర్ణయించింది. ఈ పనులు ప్రారంభమై ఆరున్నరేళ్లు గడిచినా కొన్ని పనులు నామమాత్రంగా చేపట్టి మరికొన్ని పనులు అసంపూర్తిగా వదిలేశారు.



కుంటాలలో అసంపూర్తిగా ఉన్న మార్కెట్ యార్డు



కల్లూర్‌లో నిరుపయోగంగా పాలశీతలీకరణ కేంద్రం

● అసంపూర్తిగా పనులు

మండలంలో వివిధ శాఖలకు సంబంధించి 182 పనులకు గాను రూ.14.91 కోట్ల నిధులను వెచ్చించారు. ఇందులో 131 పనులు పూర్తిచేయగా 20 పనులు అసంపూర్తిగా ఉన్నాయి. మరో 31 పనులు ప్రారంభించనేలేదు. గ్రామాలలో సీసీ రోడ్లు, మురికి కాలువలతో పాటు ప్రయాణ ప్రాంగణాలు, ధ్యానమందిరాలు, సిటిజన్ సర్వీస్ సెంటర్‌లు, అంగన్‌వాడీ భవనాలు, స్మార్ట్ తరగతిగదులు మార్కెట్ యార్డులు, ఆడిటోరియం, పార్కు, సెంట్రల్ లైటింగ్ ఇతర కొన్ని పనులు పూర్తిచేశారు. కల్లూర్ గ్రామంలో పాల శీతలీకరణ కేంద్రం భవన నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర గడుస్తున్నా అందులో పరికరాలు బిగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈభవనం అసంపూర్తిగానే మిగిలిపోయింది. డీఆర్‌డీఏ ద్వారా రూ.50 లక్షలతో మండలంలో మహిళా సంఘాలకు రెండు వరికోత యంత్రాలను సమకూర్చారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో వాటిని నడుపుతున్నారు. స్థలం కొరత కారణంగా మండలకేంద్రంలో మార్కెట్ యార్డును గ్రామం బయట నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగా వారసంత కుంటాల బస్టాండ్ ఆవరణలోనే కొనసాగుతోంది. ప్రతీ ఆదివారం ఈ సంత కారణంగా అక్కడ వచ్చి వెళ్లే ప్రయాణికులకు తీవ్రఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే ఓలా, అంబ కంటి, అందకూర్ గ్రామాలలో గిడ్డంగుల నిర్మాణం పనులు ప్రారంభించి పనులు పూర్తి చేయకుండానే వదిలేశారు. వీటికి కొన్నిచోట్ల గోడలు నిర్మించి మరికొన్నిచోట్ల పైన రేకులు బిగించకుండానే వదిలేశారు. దీంతో ఈ గిడ్డంగులు నిరూపయోగంగా ఉన్నాయి.

● పనుల్లో నాణ్యతా ప్రమాణాలు

మండలంలో 15 గ్రామ పంచాయతీలలో ఒక్కో జీపీకి రూ.20 లక్షలు వెచ్చించి మోడల్ అంగన్‌వాడీ భవనాలను నిర్మించారు. 15 జీపీల్లో ఒక్కో జీపీకి రూ.2లక్షల చొప్పున వెచ్చించి 15 జీపీల్లో పశువులకు వైద్యం చేసేందుకు ఇనుప పైపులతో గ్రీల్స్ ఏర్పాటు చేశారు. అది నాణ్యత లేకపోవడంతో రైతులు వంగిపోయి నిరూపయోగంగా మారాయి. ఒక్క గ్రామంలో కూడా ఇవి ఉపయోగంలో లేవు.

● జిమ్‌లలో నిర్వహణ లోపాలు

కల్లూర్ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో రూ.60లక్షలతో పార్కు ఏర్పాటుచేశారు. జిమ్ కోసం ప్రత్యేక పరికరాలను ఏర్పాటుచేశారు. నిర్వాహణలోపం మూలంగా ప్రస్తుతం పార్కులో గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచి నిరూపయోగంగా మారింది. మండలంలో పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో 73 పనులను గుర్తించగా 17 పనులు అసంపూర్తిగా ఉన్నాయి. 56 పనులు పూర్తయ్యాయి. డీఆర్‌డీఏ ద్వారా 46 పనులను గుర్తించగా 29 పనులు ప్రారంభం కాలేదు. 17 పనులు పూర్తయ్యాయి. ఎంపీడీవో ద్వారా 15 పనులు గుర్తించగా 2 పనులు ప్రారంభం కాలేదు. 13 పనులు పూర్తయ్యాయి. విద్యుత్‌శాఖ ద్వారా 16 పనులు గుర్తించగా అవి మొత్తం పనులు పూర్తయ్యాయి. ఆర్‌అండ్‌బీ ద్వారా పని గుర్తించారు. పూర్తయింది. మార్కెటింగ్ ద్వారా రెండు గుర్తించారు అవి అసంపూర్తిగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్ర డైయిరీ ద్వారా ఒక పని గుర్తించారు అది అసంపూర్తిగానే ఉంది. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ఒకపని గుర్తించారు అది పూర్తయింది. జిల్లా పంచాయతీ ద్వారా 10 పనులు గుర్తించి పూర్తి చేశారు. టీఎజ్ రెడ్‌కో ద్వారా రెండు పనులు పూర్తయ్యాయి. పశుసంవర్ధక శాఖలో గుర్తించిన 15 పనులు పూర్తిచేశారు. రూర్బన్ పనులకు వేగంగా చేపట్టి పూర్తిచేయాలనిప్రజలు కోరుతున్నారు.



కుభీర్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

దాడి చేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదు చేయాలి

● కుభీర్‌లో గిరిజన యువకుల భారీ ర్యాలీ

కుభీర్, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలో సేవాలాల్ జయంతి సందర్భంగా గురువారం జరిగిన శోభాయాత్రలో గిరిజన యువకులపై దాడిచేసిన దుండగులపై వెంటనే చర్యలు తీసుకొని అట్రాసిటీ కేసు నమోదు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రం కుభీర్‌లో తహసీల్దార్ కార్యాలయానికి భారీ ర్యాలీగా తరలివెళ్లి తహసీల్దార్ సోముకు వినతిపత్రం అందజేశారు. దాడికి గురైన వారికి రక్షణ కల్పించాలని, దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఠోడ్ శంకర్, గోపిచంద్, బోయిడి అభిషేక్, బొమ్మడి మల్లేష్, కమలేష్, గంగాధర్, యోగేష్, తదితరులున్నారు.

కల్లూర్‌లో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కుంటాల, ఫిబ్రవరి 16: మండలంలోని కల్లూర్ గ్రామానికి చెందిన పాలెపు దేవేందర్ (36) శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. మృతుడి తండ్రి పోతన్న, పోలీసుల కథనం ప్రకారం.. దేవేందర్ భార్య, కూతురు కొంతకాలంగా వేరుగా ఉంటున్నారు. భార్య, కూతురు తన వద్ద రావడం లేదనే బాధతో మద్యానికి బానిసయ్యాడు. దేవేందర్ శుక్రవారం ఉదయం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిపారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 16: నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు జన్మదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలోని 40మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పుస్తకాలను పంపిణీ చేశారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలోని 400ల మందితోపాటు పొట్టపెల్లి, కంజర్, రాచాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకోవటంతోపాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్, సీనియర్ నాయకులు అట్ల రామ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



పుస్తకాలను పంపిణీ చేసిన దృశ్యం

‘లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి’



మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దస్తురాబాద్, ఫిబ్రవరి16: కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి అన్నారు. జాతీయ కార్మిక సంఘాల దేశ వ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో కార్మికులు ఎన్నో పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను సవరించారని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలను బడా పెట్టుబడి దారులకు అప్పనంగా అమ్మేసి ఈ దేశ సంపదను కొల్లగొట్టారని విమర్శించారు. కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన కోడ్‌లను వెంటనే రద్దు చేసి, ప్రతీ కార్మికుడికి నెలకు 26 వేల వేతనాన్ని ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ సదుపాయాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ కార్మికులకు రోజుకు రూ.800 ఇచ్చి పనులు జరిగే స్థలం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతాంగానికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన నల్ల చట్టాలను వెంటనే రద్దు చేసి విత్తనాలు, ఎరువుల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కార్మికవర్గం ఆధ్వర్యంలో బీజేపీని గద్దెదించి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, కార్మిక సంఘాల నాయకులు ఎన్. నర్సయ్య, బొమ్మెన రవి, గీతాంజలి, రత్నమ్మ, దుర్గం వందన, డాకూర్ రాజమణి, అనసూయ, మంజుల, జాడి అమృత, మామిడి రాజేశ్వరి, గుండా నర్సవ్వ, చిట్యాల దుబ్బ రాజవ్వ, నరపాక లక్ష్మీ, ఎండపల్లి లక్ష్మీ, రైతు సంఘం జిల్లా నాయకులు మునేసుల స్వామి, వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు ఆకొండపేట్ మాజీ సర్పంచ్ దుర్గం పోశలింగు, వ్యవసాయ కార్మిక సంఘం మహిళా జిల్లా కన్వీనర్ బి.రజిత, తదితరులు పాల్గొన్నారు.



చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

చాకలి ఐలమ్మ విగ్రహ ఆవిష్కరణ

లోకేశ్వరం, ఫిబ్రవరి 16: మండల కేంద్రం లోకేశ్వరంలో శుక్రవారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఐలమ్మ మనుమడు రామచంద్రయ్య స్థానిక నాయకులతో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చాకలి ఐలమ్మ చేసిన పోరాలను, అందించిన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బసవరాజు శంకర్, రాష్ట్ర వైస్ చైర్మన్ సుంకెట పోశెట్టి, లోకేశ్వరం రజక సంఘం అధ్యక్షుడు భూమన్న, క్యాషియర్ నితిన్, లోకేశ్వరం మాజీ సర్పంచ్ సౌజన్య కపిల్, ఎం. శ్రీధర్, రామచంద్రరావు, లోకేశ్వరం ఎంపీటీసీ జైసాగర్ రావు, భోజన్న, హరీష్, లింగన్న, లస్మన్న, గజ్జరాం, అశోక్, శ్రీనివాస్, గంగాధర్, హరీష్, భూమన్న, లింగన్న, సురేష్, సాయి, గంగన్న, రాజు పాల్గొన్నారు.

అబద్ధపు ప్రచారం సహించం : ఎంపీ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16: తాను పార్టీ మారుతున్నట్లు మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అబద్ధపు ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి ఆరోపణలు సహించేది లేదని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు మండిపడ్డారు. మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మీడియా ఇట్‌చాట్‌లో సిట్టింగ్ ఎంపీ బాపురావు కాంగ్రెస్‌లో చేరేందుకు ట్రై చేస్తున్నారని ఆరోపించడంపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రాథోడ్ రమేష్‌కు పార్టీలు మారడం ఆయనకే అలవాటు ఉందన్నారు. స్వార్థం కోసం ఇంకొకరి పై నిందలు వేయడం సరికాదని, తనకు టికెట్ వచ్చిన, రాకపోయినా బీజేపీలో చివరి రక్తపు బొట్టు వరకు ఉంటానని తేల్చిచెప్పారు. మరోసారి ఇలాంటి నిరాధరణ ఆరోపణలు చేస్తే తానేంటో చూపిస్తానని హెచ్చరించారు.

‘విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే చర్యలు’

బోథ్, ఫిబ్రవరి 16: పంటల రక్షణ పేరుతో అటవీ సమీప గ్రామాల రైతులు ఏర్పాటు చేయవద్దని ఏర్పాటు చేసినట్లయితే చట్టపరంగా చర్యలు తప్పవని బోథ్ ఎస్సై బి.రాము, అధికారి ప్రణయ్‌లు పేర్కొన్నారు. రాత్రిపూట శాంతి భద్రతల పరిరక్షణతో పాటు అడవుల పరిరక్షణకు పోలీసు సిబ్బందితో పాటు అటవీ శాఖ సిబ్బంది అడవుల్లో వెళ్లాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. అయితే రైతులు తమ పంటలను రక్షించుకోవాలన్న దుఃఖంతో తమ తమ చేన్ల చుట్టూ విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. కంచెకు బదులుగా సోలార్ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసుకోవాలని వారు సూచించారు.

విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయండి : రావుల

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16: ఈనెల 20న బాసర నుంచి చేపట్టే విజయ సంకల్పా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ బస్సుయాత్ర ఇన్‌చార్జీ రావుల రాంనాథ్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 12 పార్లమెంట్ స్థానాలను గెలుపే లక్ష్యంగా అధిష్టానం బస్సుయాత్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్, నిజామాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని 21 అసెంబ్లీ స్థానాలను కలుపుతూ కొమురంభీం క్లస్టర్‌లో చేపట్టే బస్సుయాత్రలో అస్సాం ముఖ్యమంత్రి హేమంత్‌విశ్వశర్మ పాల్గొంటారని తెలిపారు. ఈ నెల 20న బాసరలో ప్రత్యేక పూజలు చేసి భైంసాలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామన్నారు. నర్సాపూర్, దిలావర్‌పూర్,నిర్మల్ మండలాల్లో రోడ్డు షోను నిర్వహిస్తామన్నారు. 21న నిర్మల్ జిల్లా కేంద్రంలోని వెయ్యి ఊడల మర్రిని సందర్శించి.. అనంతరం నేరడిగొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఆదిలాబాద్‌కు బస్సుయాత్ర చేరుకుంటుందన్నారు. ఆదిలాబాద్‌లో బహిరంగ సభను నిర్వహించి 22న రిమ్స్ ఆసుపత్రిని సందర్శించి ఇంద్రవెల్లి, ఉట్నూర్, జైనూరు, కెరమెరి, ఆసిఫాబాద్, 23నకాగజ్‌నగర్, తాండూర్, బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల వరకు బస్సుయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు బ్రహ్మానందం, ఆదినాథ్, మానాజి, నాంపెల్లి వేణుగోపాల్, మయూరిచంద్ర, దినేష్‌మటోలియా, విజయ్, కమిటీ కన్వీనర్ భూపతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా అద్దాల మేడ ప్రారంభోత్సవం

మావల, ఫిబ్రవరి 16: జిల్లా కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీనవశక్తి దుర్గామాత ఆలయ ప్రాంగణంలో నిర్మించిన అద్దాల మేడ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని అట్టహాసంగా జరిపారు. శుక్రవారం రథ సప్తమిని పురస్కరించుకుని ఉదయం నుండే ప్రత్యేక పూజలు జరిపి అద్దాల మేడలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిషన్‌మహరాజ్ నేతృత్వంలోని వివిధ అధ్యాత్మిక కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నడుమ జరిపారు. మాజీ మంత్రి జోగు రామన్న ఆలయాన్ని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అద్దాల మేడ ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన పలు పూజాది కార్యక్రమాల్లో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు.

ఉట్నూర్‌లో ప్రజా సంఘాల ర్యాలీ

- భారతరత్న డా.బీఆర్.అంబేడ్కర్‌కు ఆయా సంఘాల నివాళి
- గ్రామీణ భారత్‌బంద్‌లో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, ఆశావర్కర్లు, గ్రామ పంచాయతీ వర్కర్లు, స్కీం వర్కర్లు, తదితరులు



ఉట్నూర్ ర్యాలీలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షురాలు సునీత



ఇచ్చోడలో సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

ఉట్నూర్, ఫిబ్రవరి 16: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక విధానాలకు నిరసనగా గ్రామీణ భారత్‌బంద్‌ను నిర్వహించడం జరుగుతుందని అంగన్‌వాడీ, ఆయాల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సునిత ఆరోపించారు. శుక్రవారం దేశవ్యాప్త కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, ఆశావర్కర్లు, గ్రామ పంచాయతీ వర్కర్లు, స్కీం వర్కర్లు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో గ్రౌండ్ నుంచి ఉట్నూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్‌చౌక్ చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు సునిత మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రజలను ఆర్థిక ఇబ్బందులకు గురి చేయడం వల్ల ఎంతో మంది ఆకలి చావులతో మరణిస్తున్నారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గత ఎన్నికల్లో రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి రెండు సార్లు అధికారంలోకి వచ్చిన ఉద్యోగాలు నియమకాలు చేపట్టలేదు అన్నారు. కార్మికులు స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించడం లేదని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినప్పటికి ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. దేశవ్యాప్తంగా కోటి మంది స్కీం వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మికుల హక్కులను కాలరాయడానికి ప్రభుత్వాలు పూనుకోవడం సరైనదని కాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం నత్యవసర సరుకులు ధరలను తగ్గించడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఆశావర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు నైతంశోభ, ఆదివాసీ భారత్‌మహాస జిల్లా అధ్యక్షురాలు ప్రియాంక, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజన్న, గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేతావత్‌రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

● సమ్మెకు కాంగ్రెస్ నాయకుల మద్దతు

ఇచ్చోడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా వివిధ కార్మిక సంఘాలు శుక్రవారం ఇచ్చోడ మండల కేంద్రంలో సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు సామాజిక భద్రత పథకాన్ని ప్రవేశపెట్టాలని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి దీక్ష స్థలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గంగయ్య మాట్లాడారు. సమ్మెకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ కిషన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు బూర్గుల మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిమూద్‌ఖాన్, మండల కన్వీనర్ కల్లెం నారాయణరెడ్డి, నాయకులు కోటేష్, లక్ష్మణ్, నౌషద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● ‘ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి’

తలమడుగు: వివిధ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలో పని చేస్తున్న కార్మికులందరికి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు లింగాల చిన్నన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందులో యూనియన్ అధ్యక్షులు కార్యదర్శిలు అనుసోయా, కళావతి శోభ, సరూప,రమణ లలిత, వినోద్, అశ్విని, రాధా, లక్ష్మి, మినా, భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

భీంపూర్: కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సమ్మెకు మద్దతుగా శుక్రవారం మండల కేంద్రం భీంపూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఐకేపీ, సఫాయి కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అంగన్వాడీ అధ్యక్షురాలు దోనిపెల్లి వెంకటమ్మ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

గుడిహత్నూర్: దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మికులు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు శుక్రవారం నిరసన తెలిపారు. ఇందులో మండల నాయకులు మోహితే మారుతి, ఎస్కే ఉస్మాన్, ఉమాకాంత్, ఛాయ బాయి, ఇందుమతి, సంగీత, సురేఖ, సలీమా, సంఘమిత్ర, గంగన్న, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయా సంఘాల కార్మికులు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

బోథ్ సీఐ బాధ్యతల స్వీకరణ

బోథ్, ఫిబ్రవరి 16: బోథ్ సీఐగా బి.రమేష్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకు ముందు ఇక్కడ సీఐగా పని చేసిన భీమేష్ ఇచ్చోడ సీఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మహబూబాబాద్ రూరల్‌లో విధులు నిర్వహించిన ఈయనను బోథ్‌కు బదిలీ చేశారు.

‘తాగునీటి వసతి కల్పించండి’

బోథ్, ఫిబ్రవరి 16: మండలంలోని లేండి గూడ, జైతుగూడ, మహదుగూడ, నాగుగూడ గిరిజన గ్రామాల్లో వేసవి ముందే తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా గ్రామాలకు తాగునీరు వసతి ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రమేష్‌కు శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

తలమడుగు, ఫిబ్రవరి 16: రబీ పంటలో రైతులకు యూరియా కొరత లేకుండా ముందుస్తు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి మహేందర్ కోరారు. శుక్రవారం మండలంలోని జరీ, తలమడుగు, సుకిండి, రుయాడి బరంపూర్ తదితర గ్రామాల్లోని ఎరువుల విక్రయ కేంద్రాల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో గోదాంను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో రబీ పంట సాగు చేస్తున్న రైతులకు యూరియా, డీఏపీ, ఇతర ఎరువుల కొరత లేకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. అదే విధంగా మందులు విక్రయ కేంద్రాల్లో స్టాక్ రిజిష్టర్లు ఎప్పటికప్పుడు చూపించాలన్నారు.



పాఠశాల ఆవరణలో పంచాయతీ భవనాన్ని నిర్మిస్తున్న దృశ్యం

కొత్తూరు పాఠశాల ఆవరణలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన గ్రామస్థులు

తలమడుగు, ఫిబ్రవరి 16: మండలంలోని కొత్తూరు పాఠశాల ఆవరణలో ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మిస్తున్నారని శుక్రవారం కొత్తూరు గ్రామానికి చెందిన యువకులు కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే ప్రభుత్వ పాఠశాల బలోపేతం అవుతున్నప్పటికీ కొంతమంది రాజకీయ నాయకులు స్వార్థ ప్రయోజనాల కోసం పిల్లలను బడికి దూరం చేసేందుకు ప్రభుత్వ పాఠశాల ఆవరణలోనే ఎలాంటి అనుమతులు లేకుండా నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించడంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. ఈ విషయమే పంచాయతీ సెక్రటరీ సంపాదించగా ఎలాంటి సమాధంని వ్వలేదన్నారు. ఇకనైనా అధికారుల స్పందించి పాఠశాల విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్న పంచాయతీ భవన నిర్మాణ పనులను నిలిపి వేయాలని కోరారు. ఇందులో మహేందర్, అశోక్, అడెల్లు, ప్రమోద్, భూమన్న, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బంగారం చోరీకి యత్నం


ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16: ఓ మహిళ మెడలోంచి బంగారం దోచుకెళ్లేందుకు దుండగులు ప్రయత్నించిన ఘటన శుక్రవారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఒకటవ పట్టణ సీఐ సత్యనారాయణ వివరాల ప్రకారం.. మహారాష్ట్ర కేలాపూర్ జిల్లాకు చెందిన అన్నపూర్ణ తండ్రి ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా జిల్లా కేంద్రంలోని ఓ ఆసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో పని పూర్తయిన అనంతరం ఇంటికి తిరుగు ప్రయాణం అవుతున్న సమయంలో శివాజిచౌక్ ప్రాంతంలో గుర్తు తెలియని ఇద్దరు దుండగులు మహిళ మెడలోంచి లాక్కెందుకు ప్రయత్నించారు. మహిళ ఒక్కసారిగా కేకలు వేయడంతో అప్రమత్తమైన స్థానికులు దుండగులను పట్టుకున్నారు. ఒకరు చేతికి చిక్కినట్టే చిక్కి పారిపోయినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

జంట హత్య కేసులో నలుగురికి జైలు

ఇచ్చోడ, ఫిబ్రవరి 16: జంటహత్య కేసులో నలుగురికి పదేళ్ల కఠిన కారాగార శిక్షను విధించినట్లు జిల్లా అదనపు న్యాయాధికారి డా.శివరాం ప్రసాద్ పేర్కొన్నారు. గతంలో 2021 అక్టోబర్ 27న ఇచ్చోడ మండలంలోని గుండాల గ్రామంలో రెండు వర్గాల మధ్య రాజకీయ అధిపత్యంలో భాగంగా జరిగిన పరస్పర దాడుల్లో అబ్దుల్ రశీద్, షేక్ రఫీక్, షేక్ రబ్బానీ, షేక్ షకీల్(హకీం)లకు 10ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ10వేల జరిమానా విధించారు. అప్పటి ఇచ్చోడ సీఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసి ఇన్వెస్టిగేషన్ చేశారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులను కోర్టులో హాజరు పరుచగా నిందితులపై జైలుశిక్ష విధించడం జరిగింది.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

గుడిహత్నూర్, ఫిబ్రవరి 16: రోడ్డు భద్రత నిబంధనలు పాటించి ప్రమాదాలు నివారించాలని గుడిహత్నూర్ ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పోలీసుల ఆధ్వర్యంలో విద్యార్థులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడారు.





● ఇచ్చోడ మండల కేంద్రంలోని బెల్ట్‌షాపులో అమ్మేందుకు స్టిక్కర్ వేసి ఉంచిన మద్యం బాటిల్



● ఇచ్చోడ మండలం అడేగాం(కె) గ్రామ పరిధిలోని వైన్‌షాపులు


ఏజెన్సీలో లిక్కర్ దందా

- జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు
- నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తూ.. జేబులు నింపుకుంటున్న వైనం
- ఇచ్చోడ పరిధిలో సిండికేటుగా మారిన మద్యం వ్యాపారులు
- ఎమ్మార్పీ కంటే రూ.15 అధిక ధరకు జోరుగా అమ్మకాలు
- బాటిళ్లపై సిండికేటు స్టిక్కర్ వేసి మరీ మందుబాబుల నిలువు దోపిడీ
- మామూళ్ల మత్తులో సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు
- జిల్లావ్యాప్తంగా 3 ఎక్సైజ్ స్టేషన్లు ఉండగా.. ఆదిలాబాద్ పరిధిలో 18 వైన్స్‌లు, ఇచ్చోడలో 13, ఉట్నూర్‌లో 9.. మరో 13 బార్ అండ్ రెస్టారెంట్లు


ఆదిలాబాద్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో విచ్చలవిడిగా లిక్కర్ దందా వ్యాపారం సాగుతుంది. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలను జరుపుతూ తలో కొంత లాభాలను జేబులో వేసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అసలు నిబంధనల ప్రకారం ఏజెన్సీలో ఎలాంటి మత్తు, మద్యం విక్రయాలను జరుపరాదు. కానీ టార్గెట్‌ల పేరిట అధికారులే వ్యాపారులకు పరోక్షంగా మద్దతునిస్తూ.. లిక్కర్ సేల్స్ పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో మూడు ఎక్సైజ్ స్టేషన్లు ఉన్నాయి. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో 18, ఇచ్చోడ స్టేషన్ పరిధిలో 13, ఉట్నూర్ స్టేషన్ పరిధిలో 9 వైన్స్ షాపులు, మరో 13 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ముఖ్యంగా ఇచ్చోడ స్టేషన్ పరిధిలోనే అడ్డగోలుగా మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు పెట్టిన పెట్టుబడులను తిరిగి రాబట్టుకునేందుకు అడ్డదారుల్లో అక్రమ సంపాదనకు ఎగబడుతున్నారు. అమ్మకాలపై ప్రభుత్వం ఇచ్చే లాభాలు సరిపోవంటూ ఇష్టారాజ్యంగా ధరలను నిర్ణయిస్తూ అమ్మేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. ఎక్సైజ్ శాఖ అధికారులు నోరు మెదుపకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. వ్యాపారులు ఇచ్చే మామూళ్లతోనే అధికారులు సరిపెట్టుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

అంతా వారిదే పెత్తనం

ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న 13 మద్యం షాపుల యజమానులు సిండికేటుగా ఏర్పడి బెల్ట్‌షాపు యజమానులపై పెత్తనం చెలాయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. చెప్పింది వింటే సరే, లేదంటే ఎక్సైజ్ శాఖ అధికారులతో దాడులు చేయించి మరి వేధింపులకు గురిచేయడం పరిపాటిగానే మారిందంటున్నారు. ప్రత్యేకంగా మద్యం బాటిళ్లపై ఐసీహెచ్ (ఇచ్చోడ) అనే సిండికేట్ స్టిక్కర్లను అతికిస్తూ విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ముద్రించిన ఎమ్మార్పీ ధరలను ఏమాత్రం లెక్క చేయకుండా ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయిస్తూ మద్యం విక్రయాలు జరుపుతున్నారు. ఇచ్చోడ మండల కేంద్రానికి సమీపంలో ఉన్న అడేగామ(కె) జిన్నింగ్ మిల్లులో ఉన్న మద్యం షాపు నుంచి బెల్ట్‌షాపులకు మద్యాన్ని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. బెల్ట్‌షాపులకు తరలించేందుకు ఓ షాపును ప్రత్యేకంగా కేటాయించి అక్కడి నుంచే బెల్ట్‌షాపులకు హోల్‌సెల్‌గా మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. వ్యాపారులంతా సిండికేటుగా మారడంతో గుట్టుచప్పుడుకాకుండా కల్తీ మద్యాన్ని బెల్ట్‌షాపులకు తరలిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. వెంటనే మద్యం నాణ్యత పై పరీక్షలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలిసినా.. తెలియనట్లుగానే వ్యవహరిస్తున్నారు. వ్యాపారులు ఇచ్చే మామూళ్లతో మౌనంగా ఉండిపోతున్నారు.



● ఇచ్చోడలో సిండికేటు వ్యాపారులు వేసిన స్టిక్కర్ (వృత్తంలోనిది)



● మద్యం విక్రయించి ఇచ్చిన బిల్ చీటి

వ్యాపారులు చెప్పిందే ధర

ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధర కంటే ఒక్క రూపాయి అధిక ధరకు మద్యాన్ని అమ్మిన చట్టపరంగా వ్యాపారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. కానీ ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సిండికేటు వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలను నిర్ణయిస్తూ మద్యం అమ్మకాలు జరుపుతున్న అధికారులు సైలెంట్‌గా ఉండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒక్కో క్వాటర్‌కు రూ.5 నుంచి రూ.10, ఒక్కొ బీరుపై రూ.10 నుంచి రూ.15ల అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇదే మద్యాన్ని బెల్ట్‌షాపుల యజమానులు రూ.10 పెంచి మరి విక్రయిస్తున్నారు. ఉదాహరణకు ఎంసీ, ఐబీ క్వాటర్ ఎమ్మార్పీ ధర రూ.180ఉండగా.. మద్యం షాపుల్లో రూ.185, అదే బెల్ట్‌షాపుల్లో రూ.195కు విక్రయిస్తూ దోపిడీ దందాకు దిగుతున్నారు. ఇలా అన్ని బ్రాండ్లపై రూ.15 నుంచి రూ.20 వరకు అధికంగా వసూలు చేయడంతో మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఇదేమిటని అడిగితే ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు పోలీసులు, జర్నలిస్టులను మెయింటెనెన్స్ చేయాల్సి ఉంటుందని బహిరంగంగానే చెబుతున్నారు.

అడిగే వారే కరువు

సిండికేటు వ్యాపారుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండానే పోతున్నా.. అడిగేవారే కరువవుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గ్రామాల్లో చీప్ లిక్కర్ తాగేవారంతా సామాన్య మధ్య తరగతి వారే కావడంతో ఎమ్మార్పీ ధరలపై అడిగేందుకు జంకుతున్నారు. ఒకవేళ ఎవరైనా ప్రశ్నించిన ఎదురుదాడికి దిగి కేసుల్లో ఇరికించడం.. సిండికేటు వ్యాపారులకు వెన్నెతో పెట్టిన విద్యగా మారిందంటున్నారు. అధికారులు తరచూ పర్యవేక్షణ చేస్తున్నా.. సిండికేటు వ్యాపారుల కనుసన్నల్లోనే విధులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. సిండికేటు వ్యాపారుల స్టిక్కర్ కనిపించని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని బెల్ట్‌షాపు యజమానులను వేధించడం అధికారులకు అలవాటుగా మారిందంటున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నా.. పట్టించుకోని అధికారులు కేవలం మద్యం బాటిళ్లపై ఉన్న స్టిక్కర్లను మాత్రమే పరిశీలిస్తూ వదిలేస్తున్నారు. జిల్లాలోనే ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అధిక ధరలకు మద్యం విక్రయాలను జరుపుతున్నారు. ఆదిలాబాద్‌లో రూ.180లకు దొరికే ఎంసీ క్వాటర్‌ను అదే ఇచ్చోడ స్టేషన్ పరిధిలో రూ.195లకు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్న జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రశ్నించక పోవడంతో సిండికేటు వ్యాపారులకు అడ్డూఅదుపు లేకుండా పోయిందంటున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

: హిమశ్రీ, ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఆదిలాబాద్



ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న మద్యం అక్రమ విక్రయాల విషయం మా దృష్టికి రాలేదు. ఈ విషయమై వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం ముద్రించిన ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలి. మద్యం బాటిళ్లపై ఎలాంటి స్టిక్కర్లు అతికించరాదు. సీల్‌ను తొలగించరాదు. అలాంటి ఏమైనా జరిగితే చట్టపరమైన చర్యలు తప్పవు.

సంక్షిప్త సమాచారం



సీఎంకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే

సీఎం దృష్టికి సమస్యలు

ఉట్నూర్, ఫిబ్రవరి 16: రాష్ట్రంలోని ఉద్యోగులు జీవో నెం.317తో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చాంబర్‌లో ఎమ్మెల్యే కలిసి పలు సమస్యలు వివరించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని సదర్మాట్ కెనాల్ ద్వారా సాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. అలాగే జీవో నెం. 46 దివ్యాంగులు, ఉపాధ్యాయుల సమస్యలపై వివరించడం జరిగిందన్నారు. సీఎం స్థానిక సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ తెలిపారు.



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీపీఆర్‌వో

నూతన డీపీఆర్‌వోగా బాధ్యతలు స్వీకరించిన తిరుమల

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16: ఆదిలాబాద్ జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారిగా తిరుమల బాధ్యతలను స్వీకరించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో గల డీపీఆర్‌వో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో పాటు అదనపు కలెక్టర్ శ్యామల దేవిలను వేర్వేరుగా కలిసిన నూతన డీపీఆర్‌వో పుష్పగుచ్ఛం అందజేసి పరిచయం చేసుకున్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

నేరడిగొండ, ఫిబ్రవరి 16: మండల సర్వసభ్య సమావేశాన్ని అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. మండలకేంద్రంలో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించాల్సిన సమావేశాన్ని వాయిదా వేయగా.. ఎంపీపీ ప్రత్యేకాధికారులతో మాట్లాడారు. దీనిలో భాగంగా గ్రామాల్లో సర్పంచుల పాలన ముగియడంతో ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ అధికారులతో కలిసి సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. వేసవి కాలం సమీపిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందులో ఎంపీఓ లక్ష్మణ్, డీటీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

● సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు యాటల సోమన్న ● జిల్లాకేంద్రంలో ప్రశాంతంగా బంద్ ● కార్మిక యూనియన్ల మధ్య స్వల్ప ఘర్షణ



ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్ నుంచి ర్యాలీగా తరలివెళ్తున్న కార్మికులు



ఘర్షణకు పాల్పడుతున్న కార్మిక సంఘాల నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16: ప్రజాకార్మిక వ్యతిరేక చట్టాలు తీసుకువస్తున్న కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదించుతామని యాల సోమన్న అన్నారు. దేశవ్యాప్త సెక్టోరియల్ భారత్ బంద్ సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం ఆర్ అండ్‌బి గెస్ట్‌హౌజ్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో 800 మంది కార్మికులతో భారీ ర్యాలీ, అనంతరం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు యాటల సోమన్న హాజరై మాట్లాడారు. అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి కేంద్ర బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకు రావడం కార్మికులను బానిసలుగా చేయడం, కనీస వేతనాలు నిర్ణయించే విధానాన్ని స్వస్థి పకలికారన్నారు. కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించేందుకు అంగీకరించడం లేదన్నారు. తిరిగి కార్మికులకు 12 గంటల పని విధానాన్ని తీసుకు వచ్చిందని, అదేవిధంగా వ్యవసాయ కూలీలకు జీవనాధారంగా ఉన్న గ్రామీణ ఉపాధి హామీ పథకం బడ్జెట్ తగ్గిస్తు ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిరాకరిస్తోందని, ఈ సమ్మెతో నాలుగు లేబర్ కోడ్‌లను(కార్డును) రద్దు చేయాలని స్పష్టం చేశారు. అలాగే విద్యుత్ సవరణ బిల్లును వెనక్కి తీసుకుని ప్రతీ ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆరు గ్యారెంటీలతో కూడిన సేకరణతో పాటు వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల వాటాలు అమ్మడం, ప్రైవేట్‌పరం చేయడం ఆపాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్నభ భోజనం, ఐకేపీ, ఫీల్డ్ అసిస్టెంట్స్ కస్తూర్బా, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం లాంటి స్కీం వర్కర్లకు చట్టపరమైన కనీస వేతనాలు రూ.26వేలు చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పెరుగుతున్న ధరలను అరికట్టి ఆహార వస్తువులు, నిత్యావసరాల వస్తువులపై జీఎస్టీని ఉప సంహరించుకోవాలన్నారు. అంతేకాకుండా తెలంగాణ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్‌లకి పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో కార్మిక వర్గం తిరగబడక తప్పదని హెచ్చరించారు. కార్మికవర్గంతో పెట్టుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కార్మికులు సరైన సమయంలో సరైన తీర్పు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బండిదత్తాత్రి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సుజాత, పెర్క దేవిదాస్, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అగ్గిమల్ల స్వామి, పండుగు పోచన్న, జిల్లా నాయకులు దర్శనాల నగేష్, సుమంతాయి, ఆత్మరామ్, మధునిక, రాణికవిత తదితరులు పాల్గొన్నారు.

● రైతు సంఘం ఆధ్వర్యంలో..

కేంద్రంలో మోదీ ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ.. హక్కుల కోసం ఉద్యమిస్తున్న వారిపై భాష్పావాయువులు, రబ్బర్ బులెట్లను ప్రయోగిస్తోందని రైతు సంఘం అధ్యక్షుడు బండి దత్తాత్రి అన్నారు. దేశవ్యాప్త బంద్‌లో భాగంగా చేపట్టిన గ్రామీణ బంద్‌లో పాల్గొన్నారు. పట్టణంలోని భుక్తాపూర్ పార్టీ కార్యాలయం ఎదుట గల రహదారిపై కేంద్ర ప్రభుత్వ ప్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం అధ్యక్షుడు బండిదత్తాత్రి మాట్లాడుతూ కేంద్రంలో అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం రైతులకు కాకుండా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పని చేస్తోందని ఆరోపించారు. మద్దతుధర, పండించిన పంటలకు మార్కెట్ సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందన్నారు. ఇందులో రైతు సంఘం, ఆయా పార్టీల నాయకులు గంద్రత్‌రమేష్, అశోక్, లంకరాఘవులు, నారాయణ, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

● సీపీఐ ఆధ్వర్యంలో..

సీపీఐ ఆధ్వర్యంలో పట్టణంలోని భుక్తాపూర్ పార్టీ కార్యాలయం ఎదుట గల రహదారిపై కేంద్ర ప్రభుత్వ ప్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 80శాతం కంటే ఎక్కువ మంది వ్యవసాయం చేస్తున్నారన్నారు. కేంద్రంలోని బీజేపీ కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా చట్టాలను తీసుకు వస్తుందని ఆరోపించారు. కేంద్రం తీరుకు నిరసనగా చేపట్టిన గ్రామీణబంద్, సమ్మెలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు.

● కార్మిక యూనియన్ల మధ్య ఘర్షణ

దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఆదిలాబాద్‌లో శుక్రవారం కార్మికులు నిరసన చేపట్టారు. అయ సీఐటీయూకి చెందిన మున్సిపల్ కార్మికులు ర్యాలీలో ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా ఏఐటీయూసీ నాయకులు అడ్డుకున్నారు. ఫ్లెక్సీల విషయంలో ఇరు వర్గాల మధ్య మాటమాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. కాగా స్వల్ప తోపులాట తర్వాత గొడవ సద్దుమణిగింది.

బూటకపు హామీలతో గద్దెనెక్కిన బీజేపీ : మాజీ మంత్రి రామన్న



బహిరంగ సభలో యూనియన్ నేతలతో మాజీ మంత్రి

ఆదిలాబాద్ అర్బన్: బూటకపు హామీలతో గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరిచేలా వ్యవహరిస్తోందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా జోగు రామన్న పిలుపునిచ్చారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా కేంద్ర కార్మిక, వ్యవసాయ సంఘాల పిలుపు మేరకు తలపెట్టిన సమ్మెలో పాల్గొన్నారు. అనంతరం బంద్ సందర్భంగా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొని, ఆయా యూనియన్‌ల నేతలు కేంద్రం వైఖరిని ఎండగట్టారు. కేంద్రం తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వం వాటి అమలుల్లో విఫలమైందని మండిపడ్డారు.



కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

అర్హులైన కోలాం గిరిజనులందరికీ సబ్సిడీ రుణాలు : జేడీఏ కిషన్

తలమడుగు, ఫిబ్రవరి16: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదిమ జాతి కొలాం గిరిజనులలో అర్హులైన ప్రతీ లబిదారుడికి సంక్షేమ పథకాలను అందిస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కిషన్ అన్నారు. మండలంలోని సకినాపూర్ జీపీ పరిధిలో గల నడింపల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో భాగంగా పీవీటీజీ తెగకు చెందిన కోలాం, తోటి వెనుకబడిన జాతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి వారి కుటుంబ స్థితిగతులను తెలుసుకోవడానికి, హౌజ్ హోల్డ్ సర్వే చేస్తూ వారు కోరుకునే రంగంలో బలోపేతం చేయడానికి ప్రాథమిక సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇలా కేంద్ర ప్రభుత్వం దేశంలో వంద జిల్లాలను ఎంపిక చేసి, 22వేల అనుబంధ గ్రామాల్లో అందులో భాగంగా తెలంగాణలో మెడ్చల్, వికారబాద్, నాగర్‌కర్నూల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ ఐదు జిల్లాలను ఎంపిక చేయడం జరిగిందన్నార. అందునా ఆదిలాబాద్‌లో మూడు వందల హాబిటేషన్‌లో 9వేల కుటుంబాలను సర్వే చేయడం జరుగుతోందన్నారు. కిషాన్ క్రెడిట్ కార్డు ద్వారా డెయిరీ, గొర్రెల మేకల, పౌల్ట్రీ కలిగిన రైతులను పర్‌దేర్ వాటి పోషణ, మెంటనెన్స్ ఖర్చు నిమిత్తం చైతన్య పరుచుటకు బ్యాంకు రుణ సదుపాయం కల్పించనున్నట్లు వివరించారు. ఇందులో జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణం లక్ష్మిరాజేశ్వర్, స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 16: నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని యదావిధిగా అమలు చేయాలని టీఎస్టీవోస్ సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదిలాబాద్ కలెక్టరేట్ ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. ఉద్యోగుల ఆదాయ పన్ను పరిమితి పెంచాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని పేర్కొన్నారు. ఇందులో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రైతులు సహకార సంఘాన్ని సద్వినియోగించుకోవాలి : ఎమ్మెల్యే అనిల్

ఇచ్చోడ, ఫిబ్రవరి 16: మండల కేంద్రంలోని నిర్మించిన నూతన వ్యవసాయ సహకార సంఘ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏన్నో ఎళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతున్న పీఏసీఎస్ కార్యాలయం నూతన స్వంత భవనంలోకి మార్చడం జరిగిందన్నారు. రైతులందరూ సహకార సంఘాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ అన్‌రెడ్డి శ్రీకాంత్, ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ఎంపీటీసీ జాహిద్, శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్